# మన రైతన్నపై దశదిశలా దాడి

## తెలంగాణ అన్నదాతలపై కత్తిగట్టిన కాంగ్రెస్




### మూడు గంటల కరెంటు

1 తెలంగాణలో ఎక్కువగా ఉన్నవి చిన్న కమతాలే. వ్యవసాయానికి గంటసేపు కరెంటు ఇస్తే ఒక ఎకరం పొలం తడుస్తది. రైతులకు మూడునాలుగు గంటల కరెంటు సరిపోతుంది. 24 గంటల కరెంటు అవసరం లేదు.

-రేవంత్‌రెడ్డి (11.07.2023)

### 10 హెచ్‌పీ మోటర్లు

2 బావులు, బోర్లకు 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకొంటే మూడు గంటల్లో పొలం పారుతుంది. కాబట్టి, పొలం తడిపేందుకు రైతులు 10 హెచ్‌పీ మోటర్లు బిగించుకోవాలి.

-రేవంత్‌రెడ్డి (14.11.2023)

### ధరణి రద్దు

3 ధరణిపై ఫిర్యాదులు వస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేస్తాం. దాన్ని బంగాళాఖాతంలో పడేస్తాం.

-భట్టి విక్రమార్క (26.05.2023)

### రెవెన్యూ రివర్స్

4 కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి స్థానంలో భూమాత తెస్తాం. ఇప్పుడున్న ధరణి ఒక సాఫ్ట్‌వేర్. ఇందులో పట్టాదార్ కాలం ఒక్కటే ఉన్నది. దాన్ని మొత్తం తీసేస్తాం. భూమాత పోర్టల్‌లో పాత రెవెన్యూ రికార్డుల్లో ఉన్న కాలమ్స్ అన్నీ మళ్లీ చేరుస్తాం.

-భట్టి విక్రమార్క (17.11.2023)

తెలంగాణ రైతన్నపై కాంగ్రెస్ కత్తిగట్టిందా? ఇప్పుడిప్పుడే తెరిపినపడుతున్న వ్యవసాయంతో ముఖం తెల్లగైన అన్నదాతను మళ్లీ ఆగం పట్టించాలనుకొంటున్నదా? కేసీఆర్‌ను ఎదుర్కొనే క్రమంలో రాష్ట్ర రైతాంగంపై పగ పెంచుకున్నదా? కొద్దిరోజులుగా తెలంగాణ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు దీనినే బలపరుస్తున్నాయి. రైతుల్ని లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ చేస్తున్న వరుస దాడులు.. సాగునే కాదు, రాష్ట్ర భవితనూ దెబ్బతీసేలా ఉన్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకటికాదు, రెండు కాదు.. 24గంటల ఉచిత విద్యుత్తు మొదలుకొని రైతుబంధు వరకు అన్నింటిపైనా కాంగ్రెస్ ముఖ్యనాయకులు వ్యూహాత్మకంగా విషం చిమ్ముతున్నట్టు తెలుస్తున్నది. రెండునెలలుగా వారు చేస్తున్న వాఖ్యలు దీనినే ధ్రువపరుస్తున్నాయి. – స్పెషల్‌టాస్క్ బ్యూరో

### 5 రైతుబంధు దుబారా!

రైతులకు రైతుబంధు ఇవ్వడం దుబారా ఖర్చు. తెలంగాణ ప్రజల అమూల్యమైన సొమ్మును, పన్నుల ద్వారా కట్టే పైసలను కేసీఆర్ రైతులకు రైతు బంధు రూపంలో ఇస్తూ దుబారా చేస్తున్నారు.

-ఉత్తమ్‌కుమార్‌రెడ్డి (26.10.2023)

### 6 రైతుబంధుకు మోకాలడ్డు!

రైతుబంధు డబ్బులు జమ కాబోతున్నాయని ఆలేరు ఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమే. దీనిపై ఈసీ చర్య తీసుకోవాలి. (ఈసీకి లేఖలో..)

-నిరంజన్ (26.11.2023)

### కౌలుదారు చట్టం

7 2011లో కాంగ్రెస్ పార్టీ కౌలుదార్ల చట్టం తీసుకొచ్చింది. దాని ప్రకారం.. రైతు భరోసా కోసం కౌలుదార్లను గుర్తిస్తం. యజమాని, కౌలుదారు ఏదైతే మాట్లాడుకుంటారో అదే కౌలుదారు ఒప్పందం.

-రేవంత్ రెడ్డి (25.11.2023)

### గ్రామసభల్లో కౌలు ఒప్పందాలు!

8 రైతు భరోసా లబ్ధిదారుల కోసం గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతాం. కౌలు దార్లు ఎవరు? ఏ భూమి కౌలుకు తీసుకున్నరు? వారి కౌలు ఒప్పంద పత్రాలను పరిశీలిస్తం. గ్రామ సభల్లో కౌలు ఒప్పందాలు ఆమోదించిన తర్వాతే రైతు భరోసాపై ముందుకు వెళ్తాం.

-రేవంత్ రెడ్డి (25.11.2023)

### రైతు భరోసా ఒక్కరికే!

9 రైతు భరోసా సాయం రైతు (భూ యజమాని)కు వస్తే కౌలు రైతుకు రాదు. కౌలు రైతుకు వస్తే, రైతుకు రాదు. యజమాని, కౌలుదారుల్లో ఎవరో ఒక్కరికే రైతు భరోసా ఇస్తాం.

-రేవంత్ రెడ్డి (25.11.2023)

### మన కరెంటు కర్ణాటకకు!

10 హైదరాబాద్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని కర్ణాటకకు తరలించుకుపోయేందుకు ప్రయత్నించినట్టుగానే, లోపాయికారి ఒప్పందాలతో కర్ణాటకకు తెలంగాణ విద్యుత్తును తరలించుకుపోయేందుకు కాంగ్రెస్ కుట్రలు చేస్తున్నది. కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి ఒప్పందాలే జరిగాయి.

-రాజకీయ విశ్లేషకులు (26.11.2023)

# కాంగ్రెస్ కాటుకు 8,198 మంది బలి

- అర్ధరాత్రి విద్యుత్తుతో రోజుకు ముగ్గురు చొప్పున మృతి
- నాటి కాంగ్రెస్ పాలకుల అసమర్థ నిర్వాకమిది
- రైతు కుటుంబాలు ఆగమాగం
- చీకట్లో యమపాశాలుగా తీగలు
- నేడు నిరంతర కరెంట్‌తో నిశ్చింత
- పగటిపూటే పొలానికి నీళ్లు పెడుతున్న రైతులు

'మహబూబ్‌నగర్ జిల్లాలో కరెంట్ షాక్ కారణంగా రెండేండ్లలోనే 268 మంది రైతులు మృత్యువాత పడ్డారు. 108 మంది తీవ్ర గాయాలతో అంగ వైకల్యం పొందారు. రాత్రిపూట కరెంట్ సరఫరా చేయడమే ఇందుకు ప్రధాన కారణం. విద్యుత్తు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రైతులే విద్యుత్తు లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు రిపేర్లు చేస్తుండటం కూడా వారి ప్రాణాల మీదికి తెస్తున్నది'.. ఆగస్టు 2009లో విడుదలైన ఒక నివేదిక సారాంశం ఇది. ఉమ్మడి రాష్ట్రంలో వ్యవసాయానికి అర్ధరాత్రి విద్యుత్తు సరఫరా వల్ల కలిగిన నష్టానికి ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

హైదరాబాద్, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు హామీతో గద్దెనెక్కింది. 9 గంటలపాటు నిరంతరాయంగా ఉచిత విద్యుత్తు ఇస్తామని 2004లో ప్రచారం చేసింది. మొదటి సంతకం అంటూ హడావుడి చేసింది. కానీ, రైతులకు ఐదారు గంటలకు మించి విద్యుత్తు ఇవ్వలేదు. పగటిపూట రెండు మూడు గంటలు మాత్రమే ఇచ్చి అర్ధరాత్రి మరో రెండుమూడు గంటలు ఇచ్చేది. కొన్ని చోట్ల రాత్రివేళ మాత్రమే వచ్చేది. దీంతో రైతులు రాత్రుళ్లు పొలాల వద్దకు వెళ్లి కరెంట్ ఎప్పుడొస్తుందా? అని ఎదురు చూసేవారు. చీకటిలో స్టార్టర్లు, కరెంట్ వైర్లు, తెగిపడిన కరెంట్ తీగలు కనిపించక విద్యుత్తు షాక్‌తో అక్కడికక్కడే మరణించేవారు. రాత్రుళ్లు పాములు, తేళ్లు, విషపురుగుల కాటుకు బలైపోయిన రైతులు ఎందరో. చీకట్లో కానరాక బావుల్లో, గుంతల్లో పడి మరణించిన వారు మరెందరో. ఇంట్లో కుటుంబంతో గడపాల్సిన రైతులు రాత్రుళ్లు ఒంటరిగా బావుల దగ్గర ఉండేవారు. భార్యా పిల్లలు ఇంటిదగ్గర బిక్కుబిక్కుమంటూ గడిపేవారు.

### 8,198 మంది బలి

ఉమ్మడి రాష్ట్రంలో రోజుకు సగటున ఇద్దరు ముగ్గురు రైతులు కరెంట్ షాక్‌కు బలయ్యేవారు. మూగజీవాల సంగతి లెక్కే లేదు. రైతు సంఘాలు చెప్తున్న లెక్కల ప్రకారం.. 2004–05 నుంచి 2012–13 మధ్య తొమ్మిదేండ్లలో 8,198 మంది రైతులు కరెంట్ షాక్‌తో మరణించారు. దాదాపు అంతే స్థాయిలో తీవ్ర గాయాలతో దివ్యాంగులుగా మారిపోయారు. కానీ, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారిక గణాంకాల్లో వీటిని చేర్చలేదు. విద్యుత్తు శాఖ తమ తప్పిదాన్ని ఒప్పుకునేది కాదు. దీంతో అధికారిక లెక్కలకు, వాస్తవ పరిస్థితులకు తీవ్ర వ్యత్యాసం ఉండేది. 2009 ఆగస్టులో వచ్చిన ఒక నివేదిక ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాలో రెండేండ్లలోనే కరెంట్ షాక్ కారణంగా 268 మంది రైతులు మృత్యువాత పడితే.. 12 మందికి మాత్రమే విద్యుత్తు శాఖ పరిహారం చెల్లించింది. అంటే మిగతా వారి మరణాలను కనీసం పరిగణనలోకి తీసుకోలేదన్నమాట.




### అసమర్థ విధానాలే రైతుకు శాపం

కాంగ్రెస్ హయాంలో విద్యుత్తు ఉత్పత్తికి సరిపడా వనరులు ఉన్నా ఉత్పత్తి పెంచి, రైతులకు పగటి పూట కరెంట్ ఇచ్చే ప్రయత్నం చేయలేదు. సరఫరా సామర్థ్యం పెంచితే కరెంట్ షాక్ మరణాలను నివారించవచ్చన్న ఆలోచన కూడా రాకపోవడం వారి అసమర్థతకు నిదర్శనం. తెలంగాణ ఏర్పడేనాటికి గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 5,661 మెగావాట్లు మాత్రమే. అప్పటికే ఉన్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్లు. డిమాండ్ కన్నా ఉత్పత్తి సామర్థ్యమే ఎక్కువ. కానీ, రాష్ట్రంలో విద్యుత్తు డిమాండ్‌కు, సరఫరాకు మధ్య 20 శాతానికిపైగా లోటు ఉన్నదని ప్రభుత్వమే చెప్పేది. సరఫరా వ్యవస్థను మెరుగుపరుచుకొని ఉంటే ఈ దుస్థితి తప్పేదని, వేలాది రైతులు మరణించేవారు కాదని విద్యుత్తురంగ నిపుణులు చెప్తున్నారు.

మరోవైపు విద్యుత్తు శాఖలో తగినంత సిబ్బంది ఉండేవారు కాదు. వైర్లు తెగిపోయినా, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా రైతులే మరమ్మతులు చేయించుకోవాల్సిన దుస్థితి. మెకానిక్‌లు లేక, చేతిలో డబ్బులు లేక రైతులే స్వయంగా రిపేర్లు చేసుకునేవారు. నైపుణ్యం లేని కారణంగా విద్యుత్తు షాక్‌తో మరణించేవారు. ఫలితంగా కుటుంబాలు అనాథలుగా మారేవి. విద్యార్థులు చదువు మానేసి, బాలకార్మికులుగా మారేవారు. అనేక కుటుంబాలు పొలాన్ని పడావు పడేసి వలసలు వెళ్లి, కూలీలుగా మారాయి.

### 24 గంటల కరెంట్‌తో నిశ్చింత

తెలంగాణ వచ్చిన తర్వాత రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్తు సరఫరా అవుతున్నది. దీంతో రైతులు నిశ్చింతగా ఉంటున్నారు. ప్రభుత్వం రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి సరఫరా వ్యవస్థలను ఆధునీకరించింది, సామర్థ్యాన్ని పెంచింది. దీంతో వైర్లు తెగిపడి మరణించడం వంటి ఘటనలు నమోదు కావడం లేదు. మళ్లీ నాటి అసమర్థ విధానాలతో రైతుల పాలిట మృత్యువుగా మారిన రోజులు కావాలో, కుటుంబంతో ప్రశాంతంగా గడుపుతున్న రోజులు కావాలో ఆలోచించాల్సిన సమయమిది.

**రైతు సంఘాలు చెప్తున్న లెక్కల ప్రకారం..**

| సంవత్సరం | కరెంట్ షాక్‌తో మరణించిన రైతులు |
|---|---|
| 2004-05 | 756 |
| 2005-06 | 854 |
| 2006-07 | 692 |
| 2007-08 | 924 |
| 2008-09 | 1,207 |
| 2009-10 | 1,210 |
| 2010-11 | 1,176 |
| 2011-12 | 832 |
| 2012-13 | 547 |
| మొత్తం | 8,198 |

### బీఆర్‌ఎస్‌తోనే ఇజ్జత్.. ఇమ్మత్.. భవిష్యత్తు

- వంగపల్లి శ్రీనివాస్ మాదిగ



రామంతాపూర్, నవంబర్ 27: మాదిగల ఇజ్జత్.. ఇమ్మత్.. భవిష్యత్తు బీఆర్‌ఎస్‌తోనేనని టీఎస్‌ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోమవారం ఉప్పల్‌లో మాదిగల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డితో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. బీజేపీ మణిపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ గూండాలతో ఎస్టీ కోయ బిడ్డలను ఊచకోత కోసి విషయాన్ని బీసీలు, మైనార్టీలు మరువొద్దని సూచించారు. కాంగ్రెస్ గతంలో అధికారం చేజిక్కించుకోవడం కోసం హిందూ, ముస్లిం పేరుతో మతఘర్షణలు లేపి అధికారం చేపట్టిన విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు. మాదిగలు అందరూ సీఎం కేసీఆర్‌కు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు.

# 3 గంటల కరెంట్.. ఎకరానికో బోరు!

- 5 ఎకరాలుంటే ఐదు బోర్లు
- లేదంటే నాలుగు ఎకరాలు పడావు పెట్టాల్సిందే
- 58.38 లక్షల మందికి 5 ఎకరాల్లోపు భూమే
- కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాల సాగే
- నాటిలెక్క అన్నదాత బతుకుల్లో చిమ్మచీకట్లే

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో గుంట మొదలు 54 ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు 64,99,323 మంది ఉన్నారు. వీరిలో అత్యధికంగా ఎకరం లోపు రైతులే. అర గుంట నుంచి ఎకరం వరకు ఉన్న రైతుల సంఖ్య 22,55,181 మంది. అంటే మొత్తం రైతుల్లో దాదాపు 35 శాతం అన్నమాట. ఇక ఐదెకరాల వరకు ఉన్న రైతుల సంఖ్య మొత్తం రైతుల్లో ఏకంగా 90 శాతం. దీని ప్రకారం రాష్ట్రంలో ఉన్నది అంతా చిన్న, సన్నకారు రైతులే. ఈ క్రమంలో రాష్ట్రంలో బోర్లు, బావులకు విద్యుత్తు కనెక్షన్ల సంఖ్య దాదాపు 27 లక్షలు. దీని ప్రకారం రాష్ట్రంలో వ్యవసాయానికి కరెంటు సరఫరా అనేది ప్రాణాధారం. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం.. మరోవైపు మిషన్ కాకతీయతో వేలాది చెరువుల పునరుద్ధరణ ఫలితంగా భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో భూగర్భజలాల పెరుగుదల సరాసరి దాదాపు ఆరున్నర మీటర్లు. అందుకే బోర్లు, బావుల కింద సన్న, చిన్నకారు రైతులు ఏటా రెండు పంటలను పుష్కలంగా పండిస్తున్నారు. దీంతో 65 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండించే తెలంగాణ కేవలం తొమ్మిదిన్నరేండ్లలో మూడున్నర కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండించేస్థాయికి ఎదిగింది. దేశంలోనే పంజాబ్ వంటి రాష్ట్రాన్ని కూడా వెనక్కి నెట్టి అన్నపూర్ణగా నిలిచింది.

- రెండెకరాలున్న రైతు నాలుగైదు బోర్లు వేసినా చుక్కనీరు కనిపియ్యది. ఉన్న దానిలో ఏది నీళ్లెక్కువ పోస్తదో చూసి దానికి మోటరు బిగించుకోవాలె. కరెంటు ఎప్పుడు వస్తదో? ఎప్పుడు పోతదో? తెలియక 24 గంటలు కనిపెట్టుకొని అక్కడనే కూసోవాలె. కరెంటు వస్తే అర్ధరాత్రి... చిమ్మ చీకట్లో కూడా పొలాలకు పోయి చేన్లకు నీళ్లు పెట్టుకోవాలె. దేవుని దయ వల్ల పాము కరవక.. కరెంటు షాక్ కొట్టకుంటే రైతు క్షేమంగా ఇంటికొచ్చెటోడు. భూమిల నీళ్లు లేక, సరిగ్గా కరెంటు లేక... ఇంత చేసినా పారేది ఎకరమే. మిగిలిన ఎకరం పడావే.

**- ఇదీ రాష్ట్రం ఏర్పడేనాటికి తెలంగాణలోని రైతుల దుస్థితి**

### అవకాశముంటే భూగర్భజలాలకూ కోత!

ఇప్పుడు తెలంగాణ రైతుకు ప్రాణప్రదంగా మారిన 24 గంటల కరెంటు సరఫరాను దెబ్బ తీసి, రైతు వెన్నెముక విరిచేందుకు కాంగ్రెస్ సమాయత్తమైంది. కర్ణాటకలో వ్యవసాయానికి ఐదు గంటల విద్యుత్తు చాలు అనే ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌ను స్ఫూర్తిగా తీసుకున్న ఇక్కడి కాంగ్రెస్ నేతలు, తాము అధికారంలోకి రాగానే మూడు గంటలే ఇస్తామంటూ ఢంకా బజాయించి చెప్తున్నారు. అధికారంలో ఉన్నన్ని రోజులు రైతులకు సరైన కరెంటు ఇవ్వకుండా... అర్ధరాత్రి, అపరాత్రి పాముకాట్లు, కరెంటు షాక్‌లతో అన్నదాత ఉసురుతీసిన ఆ పార్టీ ఇన్నేళ్లయినా తన నైజాన్ని మాత్రం మార్చుకోలేదు.

> 3 గంటల కరెంట్‌తో ఎకరం పారదు. అప్పుడు ఎకరానికో బోరు వేయాలి. ఐదెకరాలున్న రైతు ఐదు బోర్లు వేయాలె. లేకుంటే 4 ఎకరాలు పడావు పెట్టుకోవాలె. 5 ఎకరాల్లోపు భూమి ఉన్న 58.38 లక్షల మంది తిప్పలు పడాల్సిందే. కాంగ్రెస్‌ను నమ్మితే మళ్లీ పాత కథే.. అన్నదాతకు కన్నీటి వ్యథే.. అందుకే 24 గంటలపాటు కరెంటుతో సాగు సంబురంగానే ఉండాల్నా? 3 గంటల కరెంటుతో భూముల్ని పడావు పెట్టుకోవాల్నా? అనేది రైతులే నిర్ణయించుకోవాలె.

- ఐదెకరాలున్న రైతయినా... ఒక్క బోరుతో ఆడుతుపాడుతూ వ్యవసాయం చేస్తున్నాడు. పొద్దుగాల పోయి మోటర్ ఆన్ చేసిండంటే చాలు! ఇతర పనులు చూసుకొని సాయంత్రం వచ్చే సరికి పొలమంతా తడుస్తుంది. ఏదైనా పని ఉండి.. పొద్దుగాల తీరని రైతు సాయంత్రం పోయి మోటరు ఆన్ చేసి, ఇంటికొచ్చిండంటే! మళ్ల పొద్దుగాల పోయే సరికి పొలమంతా తడుస్తుంది. భూమిల పుష్కలమైన జల.. రోజంతా కరెంటుతో పొలమంతా పచ్చని కళ.

**- తెలంగాణలో 24 గంటల కరెంటు తర్వాత రైతు సుఖమిది**

### 3 గంటల కరెంట్ ఉంటే

- ఎకరం పొలం దుక్కి దున్నాలంటే రోజుల తరబడి తడి పెట్టాలి. పైగా మూడు గంటలే అయినందున రైతులందరూ ఒకేసారి మోట ర్లు ఆన్ చేయడంతో ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు మోటర్లలోనూ సాంకేతిక సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఒకరోజు ఆలస్యమైందంటే తడి ప్రక్రియ మళ్లీ మొదటికొస్తుంది. ఇలా ఒక బోరుతో ఎకరం సాగు చేయడమే రైతుకు సవాల్‌గా మారుతుంది.
- రెండు, ఆపై ఎకరాలున్న రైతులు ఒక బోరుతో సాగు చేయడమనేది సాధ్యం కాదు. రైతుకు చేతనైతే... విస్తీర్ణానికి అనుగుణంగా ఎకరానికి ఒక బోరు వేసుకోవాలి. తద్వారా రోజులో మూడు గంటలు ఉన్నప్పుడు ఒక్కో ఎకరానికి ఒక బోరు చొప్పున నీటిని అందించుకోవాలి. బోరు వేయడమంటే ఇప్పుడున్న రేట్ల ప్రకారం 300 ఫీట్ల వరకైనా బోరు, మోటరు కలిపి రూ.లక్ష వ్యయం తగ్గదు. ఒక స్టాటర్ పెట్టకే రూ.3వేల వరకు వెచ్చించాల్సిన పరిస్థితి.
- ఒకవేళ రైతుకు బోరు వేయడం చేతగాకపోతే ఉన్న బోరుతో కిందామీద పడి ఎకరం సాగు చేయడం.. మిగిలిన ఎకరాలను పడావు పెట్టుకోవడం తప్ప వేరే గత్యంతరం లేదు.